క్లుప్తంగా

నిత్యావసర సరకుల అందజేత



బాలకృష్ణకు నిత్యావసర సరకులు అందిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు, నాయకులు

సింధియా: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఏకేసీకాలనీ సచివాలయం–1 గృహసారథి పెంట్ల బాలకృష్ణను సోమవారం వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పరామర్శించారు. పాస్టర్ జీవన్ సమకూర్చిన నిత్యావసర సరకులను అందజేశారు. బాలకృష్ణ త్వరగా కోలుకుని తిరిగి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు వరపల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల పూజలు



అన్నపూర్ణదేవి అలంకరణలోని గౌరీదేవికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: ప్రకాష్‌నగర్‌లోని గౌరీదేవి ఆలయంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా గౌరీదేవిని ఆదివారం సాయంత్రం అన్నపూర్ణదేవిగా అలంకరించారు. సుమారు 100 కిలోల బరువు గల 40 రకాల స్వీట్సుతో అమ్మవారి రూపాన్ని చేసి పూజలు చేశారు. స్థానిక గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో ఎమ్మెల్యే పి.గణబాబు, ఆలయ కమిటీ ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



గుల్షాన్

దాబాగార్డెన్స్: స్నేహితుడి ఇంటికి వెళ్లి వస్తానని దీపావళి రోజున వెళ్లిన ఓ యువకుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన వివరాలివి. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి టౌన్‌కొత్తరోడ్డు దరి లక్ష్మీశ్రీ నిలయంలో స్థానికంగా ఉంటున్న ఎస్.గుల్షాన్ ఓ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. దీపావళి పండగ రోజున స్నేహితుడి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పిన గుల్షాన్ తిరిగి ఇంటికి రాలేదు. తన వద్ద ఉన్న మొబైల్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. గుల్షాన్ వద్ద రూ.500 మాత్రమే ఉన్నాయని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తండ్రి హైదరాబాద్‌లోని లాజిస్టిక్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసుల దృష్టికి తీసుకురావాలని సీఐ కోరారు.

నేడు గరికిపాటికి సాహిత్య కళాభారతి పురస్కారం

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ గరికిపాటి నరసింహారావుకు సాహిత్య కళాభారతి పురస్కారంతో సత్కరించనున్నామని వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.రాజు, డాక్టర్. గుమ్మలూరి రాంబాబు తెలిపారు. పురస్కారంతోపాటు, నాలుగు రోజుల పాటు నిర్వహించే ఆకాశదీపం–కాశీఖండం ప్రవచన కార్యక్రమాలకు సంబంధించి వివరాలను సోమవారం మీడియాకు వివరించారు. విశ్రాంత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా మంగళవారం డాక్టర్.గరికిపాటి నరసింహారావుకు సాహిత్య కళాభారతి పురస్కారంతో సత్కరించనున్నారని తెలిపారు. అనంతరం బుధవారం నుంచి 17వ తేదీ వరకు రోజూ సాయంత్రం 5.30 గంటల నుంచి ఆకాశదీపం– కాశీఖండం ప్రవచనాలను డాక్టర్ గరికిపాటి నరసింహారావు ప్రవచించనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా స్టడీస్ పూర్వ విభాగాధిపతి డాక్టర్.పి.ఇందిర పాల్గొంటారన్నారు. వీఎండీఏ ప్రతినిధి పైడా కృష్ణ పసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక పూజలకు వేళాయె..

కార్తీక పూజలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆలయాలు విద్యుత్ వెలుగులతో కాంతులీనుతున్నాయి.

- ముస్తాబైన శివాలయాలు
- ఆలయ కమిటీల ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు



గోపాలపట్నం చంద్రమౌళీశ్వరాలయాంలో రంగులు వేస్తున్న దృశ్యం



ఎస్‌పీడీ సెంటర్‌లోని ఉమా విశ్వేశ్వర స్వామి ఆలయం

విశాఖ విద్య: ఎస్‌పీడీ సెంటర్‌లో ఫ్లై ఓవర్‌కు ఆనుకొని ఉన్న ప్రథమ ఉమా విశ్వేశ్వర కుమార స్వామి ఆలయం ఆధ్యాత్మిక పీఠంగా విరాజిల్లుతోంది. దేవదాయశాఖ పరిధిలో ఉన్న ఆలయ ఆలయాభివృద్ధికి భక్తులు సైతం కానుకలు ఇస్తుండడంతో మౌలిక వసతులు కల్పించారు. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా భక్తుల నీరాజనాలు అందుకుంటున్న ప్రథమ ఉమా విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం నుంచి కార్తీకమాసోత్సవాలువైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

మహిమ గల విశ్వేశ్వరుడు

మొదట్లో వినాయక విగ్రహంతో చిన్న ఆలయం ఉండేది. 1974లో ఇక్కడ ప్రథమ విశ్వేశ్వరస్వామి వెలిశారని భక్తుల నమ్మకం. నాటి నుంచి ఆలయంలో నిత్య పూజలు చేస్తున్నారు. ఎస్‌పీడీ ఫ్లై ఓవర్ నిర్మాణ సమయంలో ఇది కొంతమేర అడ్డంగా ఉన్నప్పటికీ తొలగించడానికి వీల్లేదని పరిసర కాలనీల వాసులు పట్టుబట్టారు. దీంతో ఆలయాన్ని యథావిధిగా ఉంచారు.

అభయమిచ్చే ఆంజనేయుడు

ఆలయ ప్రాంగణంలో నందీశ్వరుడు, అభయాంజనేయ స్వామి విగ్రహాలు భక్తుల మదిని దోచేలా ఉన్నాయి. పార్వతీ, దుర్గాదేవి విగ్రహాలను సైతం దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు.

మల్కాపురం: కార్తీక మాసం సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలో పలు పురాతన శివాలయాలు ముస్తాబయ్యాయి. మల్కాపురం సమీపంలోని ఐవోసీ వద్ద చింతామణి దుర్గాగణపతి ఆలయం ఉంది. ఇక్కడ 1986లో భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి మందిరం ఏర్పాటు చేశారు.

- 59వ వార్డు గణపతినగర్ కొండపై 40 ఏళ్ల కిందట పశుపతినాథ్ స్వామి ఆలయాన్ని నిర్మించారు.
- 60వ వార్డులో గుల్లలపాలెం వుడాకాలనీ హరిహర క్షేత్రంలో శివాలయం,మల్కాపురం పల్లివీధి వద్ద గల శివాలయం,శ్రీహరిపురం వద్ద గల శివాలయాలు కార్తీక మాసం సందర్భంగా ముస్తాబు అయ్యాయి.

శివోహం

గోపాలపట్నం: పవిత్రమైన కార్తీక మాస పూజలందుకోవడానికి శైవాలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాల్లో రంగులు అద్దుతూ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. గోపాలపట్నం చంద్రమౌళీశ్వరాలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేస్తున్నారు. మంగళవారం నుంచి ఆలయంలో ప్రతీ రోజు అర్చనలు అభిషేకాలతో పాటు ప్రత్యేకంగా రుద్రాభిషేకాలు చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

- 89వ వార్డు కొత్తపాలెంలోని సంతోష్‌నగర్, నాగేంద్రకాలనీ శివాలయాల్లో భక్తులకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.
- 91వ వార్డు బాజీ జంక్షన్ రామాలయం, శివాలయంలో మహిళలు నీటిలో దీపాలు వదిలేందుకు ఏర్పాట్లు చేశారు. 91వ వార్డు నందమూరినగర్, పద్మనాభనగర్‌ని ఆలయాల్లో సామూహిక పూజలు చేసేందుకు అర్చకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సామూహిక అర్చనలు, రుద్రాభిషేకాలు శాంతి పూజలు నిర్వహించనున్నారు. 26న కార్తీక పౌర్ణమి నాడు పలు ఆలయాల్లో జ్వాలా తోరణాలు వెలిగంచనున్నారు. – నరవ స్వయంభూ శివాలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ప్రదక్షిణలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. కార్తీక సోమవారాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



గణపతినగర్ ఆలయంలో కొలువుదీరిన శివలింగం



మల్లికార్జునస్వామి మందిరంలో కొలువుదీరిన శివలింగం



సింధియా న్యూకాలనీ శివాలయంలో ..



గోపాలపట్నం చంద్రమౌళీశ్వరాలయం



ఆలయంలో నందీశ్వరుని విగ్రహం



పార్వతీ, దుర్గాదేవి ఆలయాలు



నరవలోని స్వయంభూ శివాలయం

పూజలకు ప్రత్యేక ఏర్పాటు

సింధియా: సింధియా న్యూకాలనీలోని పురాతన శివాలయంలో కార్తీక మాస పూజలు అంతా సిద్ధమైంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఈ ఆలయానికి తరలివస్తారు. ఈ మాసంలో చేసే దీపారాధనకు అత్యంత ప్రాధాన్యత ఉండడంతో ఉదయం, సాయంత్రం ఆలయం వద్ద మహిళలు దీపాలు వెలిగించి భక్తితో స్వామిని ఆరాధిస్తారు. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

భక్తుల సహకారం



ఆలయాభివృద్ధికి భక్తులు ఎంతగానో సహకరిస్తున్నారు. ఆలయ కమిటీ, దేవదాయశాఖ అధికారుల కృషితో మౌలిక సౌకర్యాలు మెరుగుపడుతున్నాయి. కార్తీక మాసోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఆకెళ్ల సూర్య ప్రకాష్, ప్రధాన అర్చకులు

అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి



ఆలయ కమిటీ, దేవదాయశాఖ అధికారులు సమష్టి కృషితో సౌకర్యాలు కల్పిస్తున్నారు. భక్తులు ఉదారంగా కానుకలు ఇస్తున్నారు. విశ్వేశ్వరస్వామి ఎంతో మహిమ గల దేవుడు. స్వామిని దర్శించుకున్న వారి సమస్యలన్నీ తీరుతాయి. ఆలయాభివృద్ధిలో భక్తులు అంతా భాగస్వామ్యం కావాలి.

– రామమూర్తి శర్మ, ఆలయ అర్చకులు

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

మల్కాపురం: మల్కాపురం శాఖా గ్రంథాలయంలో మంగళవారం నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ అధికారి అజేయ్‌కుమార్ తెలిపారు. సోమవారం గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వివరాలు వెల్లడించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ,దేశభక్తి గీతాలపాన ఉంటుందన్నారు.

- 15వ తేదీన ఉదయం 10 గంటలకు పుస్తక ప్రదర్శన , 5,6,7వ తరగతి విద్యార్థుల (జూనియర్ కేటగిరి),8,9,10,ఇంటర్,డిగ్రీ (సీనియర్ కేటగిరి)విద్యార్థులకు వివిధ అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు.
- 16 ఉదయం 10 గంటలకు గ్రంథాలయ ఉద్యమంపై ప్రసంగాలు,విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు ఉంటాయి.
- 17న ఉదయం 10 గంటలకు మహిళా చట్టాలపై ప్రముఖ న్యాయవాది విశ్వనాథ్‌రాజు ప్రసంగం ఉంటుంది. అనంతరం కవి సమ్మేళనం నిర్వహిస్తారు.



చిన్నారులు గీసిన చిత్రాలను చూపుతున్న దృశ్యం

- 18న ఉదయం 10 గంటలకు క్విజ్ ,వక్తృత్వ పోటీలు ఉంటాయి.
- 19న మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలు–చైతన్యం అనే అంశంపై సెమినార్ ఉంటుంది.
- 20న ముగింపు ఉత్సవంలో భాగంగా వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత సుంకర చలపతిరావు,జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భైరవకోనకు పోటెత్తిన భక్తులు

సింహాచలం: అమవాస్య పురస్కరించుకుని సోమవారం భైరవవాకలోని భైరవస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

ఆలయనికి వెళ్లే రెండు కిలోమీటర్ల అటవీమార్గం భక్తులతో కిక్కిరిసింది. తెల్లవారుజాము రెండు గంటల నుంచి నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకున్నారు. స్వామికి అభిషేకాలు నిర్వహించారు. విభూదితో అర్చన చేశారు.అమృత కలశాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా దీపాలతో నిండిపోయింది.



భైరవస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

కనుల పండువగా దీపావళి



గోపాలపట్నం ప్రధాన రదారిలో..



కొత్తపాలెంలో బాణసంచా కాంతులు

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో దీపావళి పండగను సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. సాయంత్రం దీపాలతో ఇళ్లను ప్రత్యేకంగా అలంకరించారు. వీధుల్లో బోదులు కొడుతూ పెద్దలకు మొక్కులు చెల్లించారు. కొందరు దుస్తులు, పిండి వంటలు చూపిస్తూ పూజలు చేశారు. అనంతరం టపాసులు వెలిగించారు. సుమారు 11 గంటల వరకు టపాసుల మోతతో దద్దరిల్లింది. గోపాలపట్నం ప్రధాన రహదారి పొగతో నిండి పోయింది.

పారిశ్రామిక ప్రాంతంలో..

మల్కాపురం: దీపావళి వేడుకలు పారిశ్రామిక ప్రాంతంలో ఆదివారం వేడుకగా జరిగాయి. ఇంటి ముందు, ఆవరణలో దీపాలను అలంకరించి,ఇంట్లో లక్ష్మీదేవిని నెలకొల్పి,పలు పిండి వంటలను నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. పూజలు అనంతరం బోదులతో పూజలు చేశారు. అనంతరం బాణసంచా కాల్చారు. పర్యావరణంపై అవగాహన పెరగడమో.. బాణసంచా ధరలు పెరగడమో తెలియదుగాని ఈ ఏడాది యువత శబ్దాలు వచ్చే బాంబులు పెద్దగా కాల్చలేదు. జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్‌నగర్ ప్రాంతానికి చెందిన యువత ఓటు హక్కు వల్ల ప్రయోజనం,అర్హత ఉన్న వారికే ఓటు వేయాలనే సందేశాన్ని సూచిస్తూ తయారు చేసిన బాణసంచా కాల్చారు.



ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ ఏర్పాటు చేసిన బ్యానర్

జీవీఎల్‌కు ఘన స్వాగతం



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న జీవీఎల్ నరసింహరావు

గోపాలపట్నం: ఢిల్లీ నుంచి విశాఖ వచ్చిన రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావుకు విమానాశ్రయంలో తుంగ్లాం వాసులు సోమవారం ఘన స్వాగతం పలికారు. తుంగ్లాం వాసులకు రహదారి సౌకర్యం కల్పించడంలో చొరవ చూపినందుకు ఆయనకు ప్రత్యేకంగా ఆయా ప్రాంతల వాసులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జీవీఎల్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా తుంగ్లాం ప్రాంత గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బీహెచ్ఎల్ కంపెనీకి భూములు ఇచ్చినవారికి రహదారి ఇవ్వడం కనీస బాధ్యత అన్నారు. ఈ గేట్లు తెరచుకోవడంతో చుట్టు పక్కల వారికి అత్యవసర పరిస్థితుల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సంక్రాంతి లోపు గేటు పూర్తిగా తెరుచు కుంటుందని ఆయన హామీ ఇచ్చారు. నాయకులు కె. నాగేశ్వరరావు, బాల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గోపాలపట్నం: ప్రయాణికుల సౌకర్యార్థం సలహాలు, సూచనలు స్వీకరించడానికి మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆర్టీసీ సింహాచలం డిపో మేనేజర్ కె. రాజశేఖర్ తెలిపారు. 9959225592, 7382825592 నంబర్లకు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

వైభవంగా గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం గవరవీధి రామాలయం వద్ద గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. సుమారు 41 రోజుల పాటు జరిగే ఉత్సవాలకు శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కార్తీక మాసం నెల రోజులు తెల్లవారుజాము నుంచి స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నారు. ఈ నెల 23న ఏకాదశి పురస్కరించుకొని సామూహిక కుంకుమ పూజలు ఉంటాయి. 26న కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపారాధనలు, జ్వాలాతోరణం నిర్వహించనున్నారు. డిసెంబర్ 4న పార్వతీ పరమేశ్వర కల్యాణం అత్యంత వైభవోపేతంగా జరిపించనున్నారు. 6న అమ్మవారి నిమజ్జనం వేడుక ఉంటుంది. అదే రోజు మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం అందించేలా ఉత్సవ కమిటీ వారు ఏర్పాట్లు చేస్తున్నారు.



గౌరీ పరమేశ్వరులు

ప్రయాణికుల ప్రాణాలు మీ చేతుల్లోనే..

ట్రాఫిక్ ఎస్ఐ వాసుదేవరావు

విశాఖ విద్య: ప్రయాణికుల ప్రాణాలు మీ చేతుల్లోనే ఉంటాయి.. వారిని సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చడంలో ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని ఎయిర్‌పోర్టు ట్రాఫిక్ ఎస్ఐ జి. వాసుదేవరావు అన్నారు. ఎన్ఏడీ ఫ్లై ఓవర్ కింద సోమవారం ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలు–ప్రమాదాల నివారణ అనే విషయమై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వాసుదేవరావు మాట్లాడుతూ ఎయిర్‌పోర్టుతో పాటు, ఎన్ఏడీ చుట్టుపక్కల కాలనీలకు రాకపోకలు సాగించే వారు ఎక్కువగా ఆటోలను ఆశ్రయిస్తున్నారన్నారు. ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ఆటో డ్రైవరు నంబర్, పేరుతో కూడిన బోర్డు తప్పనిసరిగా ఆటోల్లో ఏర్పాటు చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఆటో నడుపవద్దన్నారు. ట్రాఫిక్ పరమైన ఎటువంటి ఇబ్బందులు ఎదురైనే సమీపంలోని ట్రాఫిక్ పోలీసులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



అటోడ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ వాసుదేవరావు

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

క్రైం ఏసీపీ వెంకటరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈస్ట్ ఏసీపీ వెంకటరావు

అల్లిపురం: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని క్రైం ఏసీపీ ఎ.వెంకటరావు అన్నారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు, క్రైం డీసీపీ గంధం నాగన్న సూచనలతో ఆయన టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొబ్బరితోటలో సోమవారం సాయంత్రం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆధునిక సాంకేతికతతో సీసీ కెమెరాలు అందుబాటులోకి వస్తున్నాయని, వీటిని ప్రతీ వీధిలో ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేర రహిత సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు లోను కావద్దన్నారు. అలా ఎవరైనా మోసానికి గురైతే 100, టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఈస్ట్ క్రైం సీఐ చక్రధరరావు, టూటౌన్ క్రైం ఎస్ఐ కె.శ్రీను, ఏఎస్ఐ అప్పారావు, హెచ్‌సీ హఫీజ్, అర్జున్ పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.

వీజేఎఫ్ సభ్యత్వ రెన్యువల్ గడువు పొడిగింపు

అల్లిపురం: వైజాగ్ జర్నలిస్ట్స్ ఫోరం (వీజేఎఫ్) సభ్యత్వ రెన్యువల్ గడువు కలెక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు మరో మూడు రోజులు పొడిగిస్తున్నట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు 430 మంది సభ్యులు రెన్యువల్ చేసుకున్నారని తెలిపారు. మిగిలిన వారు రెన్యువల్ దరఖాస్తును వెంటనే సమర్పించాలని కోరారు.

భద్రతకు అధిక ప్రాధాన్యం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ విభాగంలో శూన్య ప్రమాద లక్ష్యంగా ఉద్యోగులు ముందుకు సాగాలని స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగాధిపతి డి.రాం ప్రసాద్ కోరారు. కోక్‌ఓవెన్స్ విభాగం సేఫ్టీ కమిటీ ఆధ్వర్యంలో విభాగం ఏరియా షాపు ఆఫీసు వద్ద భద్రతా పతకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందులో భాగంగా నిత్యం భద్రతా చర్యలను పరిశీలిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోందన్నారు. కోక్‌ఓవెన్స్ విభాగాధిపతి ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులందరూ తమ విధి నిర్వహణలో భద్రతా పనిముట్లను తప్పనిసరిగా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు కొమ్ము ప్రసాదరావు, ఎస్.జె. ప్రసాద్, టి.వి.కె.రాజు, విభాగం జీఎంలు , డీజీఎంలు పాల్గొన్నారు.

నూతన డైరెక్టర్‌కు ఇంటక్ అభినందనలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్)గా ఎంపికైన జి.వి.ఎన్. ప్రసాద్‌ను స్టీల్ ఇంటక్ నాయకులు అభినందించారు. నాయకులు సోమవారం ఆయన కార్యాలయంలో కలిసి శాలువా కప్పి, బొకే అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చార్జిమన్‌గా ప్లాంట్‌లో చేరి డైరెక్టర్ స్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు. ఆయన నేతృత్వంలో ప్లాంట్ మార్కెటింగ్ మరింత అభివృద్ధి చెందగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నీరుకొండ రామచంద్రరావు, బీఎన్ రాజు, కారు రమణ, ప్రభాకరరెడ్డి, అవతారం, ఎస్.ఎ.నాయుడు పాల్గొన్నారు.